కథ

# ఓనమాలు

''గణేష్ మహరాజ్‌కీ..జై''

పిల్లలూ పెద్దలూ కూడా ఉత్సాహంగా జైజైలు కొట్టారు.

గణపతి నవరాత్రుల సందర్భంగా నవజీవన్ ఎపార్ట్‌మెంట్స్ ప్రక్కనే గల ఖాళీస్థలంలో పందిరేసి వినాయకుడ్ని ప్రతిష్ఠించారు. పెద్దలకన్నా పిల్లలే శ్రద్ధాభక్తుల్తో రోజూ పూజలూ, భజనలూ చేస్తున్నారు.

ఇక ఎపార్ట్‌మెంట్స్‌లోనివారంతా కలిసి ఏర్పాటుచేసుకున్న కమిటీ కార్యదర్శి అనంతమూర్తి హడావిడి అంతా ఇంతా కాదు. అంతా తానై అన్నిటా తానై చక్కబెడుతున్నాడు. అసలు ఎపార్ట్‌మెంటు వాసులూ చుట్టుప్రక్కలవారూ కలిసి గణపతి నవరాత్రులు చేద్దామంటూ పూనుకుని అందర్నీ ఒప్పించిందతడే.

ఒక పిల్లాడు కుడుములు తెచ్చుకుని తింటోంటే మల్లి వాడి ప్రక్కనే చేరి ''నాకు పెట్టవా'' అంటూ చేయి చాచింది. వాడు బిక్కమొఖం వేసి చూశాడు. మళ్ళీ అడిగింది. ఏడుపందుకున్నాడు.

''ఎందుకేడుస్తున్నావురా'' అంటూ వచ్చింది వాడి అక్క శిరీష.

''కుడుము పెట్టమంటోంది..'' ఏడుస్తూనే చెప్పేడు.

శిరీష మల్లి వంక చూసింది.

ఆ పిల్లకి ఏడెనిమిదేళ్ళుంటాయి. సన్నగా వుంది. నీరసంగా వుంది. కురచ గౌను తొడుక్కుంది. జుట్టుకి నూనె రాసుకుని ఎన్నోరోజులైనట్టుగా వుంది.

''ఆకలేస్తోంది..'' అంది మల్లి కళ్ళనీళ్ళు పెట్టుకుని.

మల్లి మూడొందల రెండు ఎపార్ట్‌మెంట్లో పనిపిల్లగా పనిచేస్తుందని తెలుసు. తాము కాన్వెంటు కెళ్తోంటే ఆశగా చూస్తూంటుందనీ తెలుసు. తమ పుస్తకాలు చూడాలని తమతో జట్టు కట్టాలని ఉబలాట పడ్తూంటుందనీ తెలుసు.

''అన్నం తినలేదా?'' సానుభూతిగా చూస్తూ అడిగింది శిరీష.

''ఊహూ. రోజూ కొంచెం కొంచెమే పెడతారు. ఇవాళ అస్సలు పెట్టలేదు.''

శిరీష కేంచెయ్యాలో బోధపళ్ళేదు. వెళ్ళి బాబిగాడికి చెప్పింది. వాడొచ్చి అడిగాడు. శిరీషకి చెప్పినట్టే చెప్పింది. ఇద్దరూ కళ్ళతో కూడబలుక్కుని ''తింటానికేమైనా తెస్తాముండు'' అని చెప్పి పరుగుతీశారు.

ఒకరు బూరెలూ, మరొకరు పులిహోర తీసుకొచ్చి పెట్టారు. అవురావురుమంటూ తినేసింది మల్లి.

''ఏవిటి పిల్లలూ ఈ మూలకి చేరి ఏం చేస్తున్నారూ'' అంటూ వచ్చాడు అనంతమూర్తి.

''అంకుల్. ఈ మల్లికి 302 వాళ్ళు సరిగ్గా అన్నం పెట్టడంలేదంట'' అని శిరీష అంటే ''ఆకలేస్తోందని ఏడుస్తోంటే తింటానికి తెచ్చిపెట్టేం'' అన్నాడు బాబిగాడు.

సాలోచనగా చూశాడు. ఆ పిల్ల దీనమొఖం చూసేసరికి జాలేసింది.

''వీళ్ళు చెప్పింది నిజమేనా?'' అనడిగాడు.

తలూపింది.

ఏం చేయాలో తోచనట్టు కొన్ని నిమిషాలపాటు మౌనంగా వుండిపోయాడు. తర్వాత ఎపార్ట్‌మెంట్స్ కమిటీ ప్రసిడెంటు రమణని పిలిచి మల్లి గురించి చెప్పేడు.

''పనిపిల్ల గొడవ కూడా నెత్తినేసుకుంటానంటావేంటి గురూ. మ్యూజిక్ ప్రోగ్రాం వాళ్ళింకా రాలేదు. ఫోన్ చెయ్యనా''

''బయల్దేరుతున్నట్టు ఫోన్ చేశార్లేగాని ఎంత పనిపిల్లయినా మన ఎపార్ట్‌మెంట్స్‌లో వుంటోంది. పని చేయించుకుంటూ కడుపునిండా తిండిపెట్టక మాడిస్తే ఎలా చెప్పు? 302లో వుంటున్న సుబ్బారావుని అడుగుదాం''

అనంతమూర్తి మాటలు రమణకి రుచించలేదు.

''అనవసరంగా మనస్పర్థలొస్తాయి గురూ''

''వస్తే రానీ. మనం మనుషులంగాని మానులం కాదుగదా''

రమణ ఏదో చెప్పేలోగా వైస్ ప్రసిడెంట్ జ్యోత్స్నారాణి వచ్చింది. సంగతి తెలుసుకుని పెద్ద గొంతుతో ''ఇంత దారుణమా. పసిపిల్లని మాడ్చి చంపేస్తున్నాడు. 302 డౌన్‌డౌన్'' అని అరిచింది.

మరికొందరు ఏవిటేవిటంటూ వచ్చారు. పందిట్లో భజన చేస్తున్నవాళ్ళలో కొందరు హడావిడిగా లేచొచ్చారు.

విషయం విని ''వెళ్ళి నిలదీయాల్సిందే'' అన్నారంతా ముక్తకంఠంతో.

''సరే పదండి'' మల్లిని తీసుకొని కదిలాడు అనంతమూర్తి. మిగతావాళ్ళు అనుసరించారు.

302 ఎపార్ట్‌మెంట్ కాలింగ్‌బెల్ నొక్కారు. సుబ్బారావు తలుపు తీశాడు. జనాన్ని చూసి ఖంగుతిన్నాడు. వారిముందున్న మల్లిని చూసి ఆగ్రహంతో ఊగిపోయాడు.

''ఈ దెయ్యపుముం.. ఏమైనా దొంగతనం చేసిందా? నాకు తెలుసు. అలాటిదేదో చేసే వుంటుంది. రావే రాక్షసీ నరికి పోగులెడతాను...''

మల్లి చెయ్యిపట్టుకొని విసురుగా లాగాడు. ముందుకి తూలిపడింది. 'అయ్యో' అన్నారంతా ఒక్కసారే.

''తొందరపడకండి సుబ్బారావుగారూ. మల్లి ఎలాంటి దొంగతనమూ చెయ్యలేదు. మల్లిగురించి మీతో కొంచెం మాట్లాడాలనొచ్చాం''

నుదురు చిట్లించి ప్రశ్నార్థకంగా చూశాడు సుబ్బారావు.

''మనమంతా ఒకే బిల్డింగులో కలిసి మెలిసి వుంటున్నాం. ఒకరి కష్టసుఖాల్లో ఒకరం పాలుపంచుకుంటూ ఒక కుటుంబంలా కలిసి వుంటున్నాం...''

అనంతమూర్తి నాన్పుడు వ్యవహారానికి చిర్రెత్తుకొచ్చింది జ్యోత్స్నారాణికి. ''చల్లకొచ్చి ముంత దాస్తారెందుకూ'' అంది.

''అక్కడికే వస్తున్నా. అసలు సంగతేవిటంటే సుబ్బారావుగారూ మల్లికి మీరు సరిగ్గా భోజనం పెట్టడంలేదని తెలిసింది...''

''అలా కూసిన పీనుగెవడూ?!'' అంటూ లోపల్నుంచి తోసుకొచ్చింది సుబ్బారావు భార్య.

అంతా తమకు తెలీకుండానే ఒక్కడుగు వెనక్కేశారు.

''ఎక్కడో గోదావరి జిల్లాలోని మారుమూల పల్లెనుంచి దీన్ని పనిచేస్తుంది కదాని ఈ పట్నం తీసుకొచ్చాం. తిండీ బట్టా ఇస్తున్నాం. ఈమధ్య సరిగ్గా పనిచెయ్యట్లేదని దార్లోకొస్తుందని చెప్పి ఒక పూట కాస్తంత అన్నం తగ్గించాం. అంతమాత్రానికే మా ఇంటిమీదకొచ్చి ఇంత రాద్ధాంతం చేస్తారా? అసలు మీకూ మాకూ ఏవిటి సంబంధం? ఇది మేం తీసుకువచ్చిన పనిపిల్ల. దీన్ని మాడుస్తాం. నరికి పోగులెడతాం. అడగడానికి మీరెవరసలు?''

''అది కాదమ్మా. తోటి మనుషులుగా...''

''అడ్డమైనవారిచేత నీతులు చెప్పించుకునేంత హీనస్థితిలో మేం లేం'' అంటూ గబుక్కున మల్లిని

లోపలికి లాగి ధడేలున తలుపేసేసింది.

ఒక్కరి ముఖాల్లోను కత్తివేటుకి నెత్తురు చుక్క లేదు.

''ఈవిడ నోట్లో నోరు పెట్టలేం'' అని జ్యోత్స్నారాణి అనగా, ''పిల్లల మాట పుచ్చుకొని అనవసరంగా వచ్చాం'' అనుకుంటూ వెనుదిరిగా రంతా.

మరో అరగంటకి 302 ఎపార్ట్‌మెంట్లోంచి కెవ్వుకెవ్వుమన్న కేకలు విన్పించాయి.

అంతా అటుకేసి బాధగా చూశారు.

గణేశుడి భజనలోగాని, మ్యూజిక్ ప్రోగ్రాం లోగాని ఎవరూ మనసు లగ్నం చేయలేకపోయారు.

కాని పిల్లలంతా ఒకప్రక్కకి చేరి గుంపు చింపులు పడసాగారు.

''మల్లి రాదు వెళ్ళండి'' కోప్పడ్డాడు సుబ్బారావు.

''మేం మల్లిని చూడాలి. మల్లీ...'' గట్టిగా అరుస్తూ పిలిచా రంతా.

''మల్లి రాదు'' అంటూ తలుపేసుకున్నాడు.

పిల్లలంతా కోపంగా తలుపు బాదారు. ఈసారి సుబ్బారావు భార్య తలుపు తీసింది.

''శని పిల్లల్లా దాపురించారే. పోండి..'' అని కసిరింది.

శిరీష ముందుకొచ్చి ''మల్లిని చంపేశారు. రాత్రి మేమంతా కేకలు విన్నాం. పోలీస్ రిపోర్టిస్తాం'' అంది ధీమాగా.

అవాక్కయ్యిందామె. ఆమె వెనుకే వచ్చిన సుబ్బారావు ప్రూన్పడి పోయాడు.

ఈ గొడవకి అనంతమూర్తీ, రమణా అందరూ వచ్చారు. మల్లిని చావగొట్టి వుంటారని విశ్వసిస్తున్నాం. సంగతేవిటో తెలుసుకోవాలని పిల్లల వంకన వచ్చారు.

''మల్లిని చంపేశారు. పోలీసులకి ఫోన్ చేస్తాం'' అన్నాడు బాబిగాడు.

''అయ్యో అయ్యో ఎంత ఘోరం...'' అరిచిందొకావిడ.

''మీరింకా పెద్దమనిషి అనుకుంటున్నాం. నిజంగానే మల్లిని...''

''అబ్బెబ్బే మేమెందుకు చంపుతాం. భలేవారే. ఆ మాత్రపు జ్ఞానం లేదేంటి మాకు. ఏదో బెదిరించడానికి రెండు వాతలు పెట్టామంతే'' అంటూ మల్లిని ముందుకు తీసుకొచ్చి చూపించాడు సుబ్బారావు.

బిక్కచిక్కి వుంది మల్లి. కాళ్ళమీద చేతుల మీదా నల్లగా కాలిన మచ్చలూ బొబ్బలూ!

''పసి పిల్లని



కాల్చేశారమ్మా. వీళ్ళకి చేతులెలా వచ్చాయో!'' అందొకావిడ.

''మీరు చేసిన పనేం బాగోలేదు. పోలీసులకి తెలిస్తే మిమ్మల్ని కటకటాల వెనక్కి తోసెయ్యడం ఖాయం'' అన్నాడు అనంతమూర్తి.

**సింహప్రసాద్**

''పోలీసులకి ఫోన్ చేస్తాం. కంట్రోల్ రూం ఫోన్ నెంబరు నాకు తెలుసు'' అంది కిరణ్ అనే అమ్మాయి.

గబుక్కున చేతులు జోడించేశాడు సుబ్బారావు. ''తప్పైపోయింది. ఇంతటితో ఈ గొడవ వదిలెయ్యండి. ఇకనుంచి మల్లిని కంటికిరెప్పలా చూసుకుంటాం''

దాంతో అతడికి సన్నగా చీవాట్లు పెట్టి పిల్లలకి సర్దిచెప్పి పంపేశాడు అనంతమూర్తి.

మరి వారం రోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి.

కాని మల్లి మాత్రం 302లోంచి బయటికే రాలేదు.

హుస్సేన్ సాగర్లో గణేష్ నిమజ్జనం చేసివచ్చారంతా.

ఎపార్ట్‌మెంట్స్ గేటుముందు దిగులుగా కూర్చునుంది మల్లి.

''అలా వున్నావేం మల్లీ''

భళ్ళున ఏడ్చేసింది.

అడగ్గా అడగ్గా సుబ్బారావు వాళ్ళూ ఇల్లు ఖాళీ చేశారనీ తనని వదిలేసి మరోచోటుకి వెళ్ళిపోయారని చెప్పింది.

ఎక్కడో వున్న పల్లెనుంచి సిటీకి తీసుకొచ్చి అర్థాంతరంగా వదిలేసి పోతాడా అని సుబ్బారావు మీద కారాలు మిరియాలు నూరారంతా.

''సుబ్బారావు సంగతి అలా వుంచండి. ఇప్పుడేవిటి చెయ్యడం'' అనడిగాడు అనంతమూర్తి.

ఆలోచనలో పడ్డారంతా.

''మీ ఊరికి టిక్కెట్టు తీసి బస్సెక్కిస్తాం. వెళ్ళిపోగలవా'' అనడిగాడు అనంతమూర్తి.

తల అడ్డంగా వూపుతూ ''వెళ్ళను...'' అంది మల్లి.

''ఏం ఎందుకెళ్ళవ్? నీకెవ్వర్లేరా?'' మరొకరడిగారు.

''అయ్య వున్నాడు. అమ్మ వుంది. తమ్ముడు చెల్లెలూ వున్నారు''

''మరింకేం? వెళ్ళి వాళ్ళతో హాయిగా వుండచ్చు కదా''

''సదూకుంటాను''

''మీవూరెళ్ళి చదువుకో. ఎవరొద్దన్నారు?''

''ఆడ బడిలేదు. పని చేయించుకొని సదివిత్తానంటే నన్ను పంపేడు అయ్య. సదూకోకుండా మల్లీ అయ్యకు మొకం సూపించలేను''

పరిస్థితి అందరికీ అర్థమైంది. చదువుకోసం ఆ పిల్ల పడుతోన్న తపన అర్థమైంది. చదువు చెప్పిస్తానని తీసుకొచ్చి నడిరోడ్డుమీద వదిలేసి వెళ్ళిన సుబ్బారావు దుర్మార్గం బోధపడింది.

కాని ఏం చేయాలో తోచలేదు. ఎంతాలోచించినా పరిష్కార మార్గం కనబడలేదు.

''సరేలే, ఏదోదారి చూస్తాంగాని పద ఇవ్వాళ్టికి మా ఇంట్లో అన్నం తిందువుగాని'' అంటూ తీసుకెళ్ళాడు అనంతమూర్తి.

ఆ రాత్రే ఎపార్టుమెంట్సులోని వాళ్ళందరినీ పిలిచి మీటింగెట్టాడతడు.

''త్రినాట్ టూలో వుండే సుబ్బారావు మల్లి అనే పల్లెటూరి అమ్మాయిని పనిచేయించుకొంటూ చదివిస్తానని నమ్మబలికి తీసుకొచ్చాడు. చదివించడం మాట దేవుడెరుగు సరిగ్గా తిండి కూడా పెట్టేవాడుకాదన్న సంగతి మనందరికీ తెలిసిందే. ఇప్పుడా పిల్లని అర్థాంతరంగా వదిలేసి మాయమైపోయాడు. ఇలాటి సిగ్గుమాలిన పనివల్ల మన్లాటి చదువుకున్న వాళ్ళందరికీ కూడా తలవంపులొచ్చే ప్రమాదముంది. ఈ పిల్ల పల్లెకి తిరిగెళ్ళి ఇక్కడ జరిగిందంతా చెబితే వాళ్ళు మనగురించెంత హీనంగా భావిస్తారో ఆలోచించమని కోరుతున్నాను. అంచేత మనమంతా కలిసి మల్లిని కనీసం టెన్త్‌క్లాస్ పాసయ్యే వరకూనైనా చదివిస్తే బావుంటుందని నా సూచన. మీమీ అభిప్రాయాలు చెప్పండి''

సభలో కలకలం చోటుచేసుకుంది.

అదెలా సాధ్యం అంటూ పెదవి విరిచారు కొందరు.

''చదువు మీద ఎంతో శ్రద్ధవున్న ఇలాటి అమ్మాయిని ఆదుకోవడం, చేయూతనివ్వడం మన బాధ్యత. అనాథల్నీ, ఆర్థిక స్థోమత లేనివారినీ కొందరు స్పాన్సర్ చేసి చదివిస్తుంటారని మనకి తెలుసు. అలాగే మన నవజీవన్ ఎపార్ట్‌మెంట్స్‌వాళ్ళమంతా కలిసి మల్లిని స్పాన్సర్ చేద్దాం. ఆమెకయ్యే ఖర్చునంతా భరిద్దాం. ఒక పసిపిల్లకి దారి చూపిద్దాం''

అనంతమూర్తి మాటలకి ''ఇది జరిగే పని కాదు'' అందొకావిడ.

''ఎందుక్కాదు?'' అని ప్రశ్నించారింకొకరు.

''మా బట్టలిస్తాం మా పుస్తకాలిస్తాం'' అని అరిచారు పిల్లలు.

''రోజుకొకరి ఇంట్లో తను చేయగలిగినంత పనిచేస్తూ చదువుకుంటుంది. అందుగ్గాను వాళ్ళామెకి ఇంత అన్నం పెడితే చాలు. మొత్తం ముప్పై ఆరు అపార్టుమెంట్లున్నాయి. అంటే నెలకొకరోజా చొప్పున ఆమె మంచీ చెడ్డా చూస్తే చాలు. మనందరి ఇళ్ళలో తిరుగుతూ పెరుగుతూ చదువుకుంటుంది. యస్సెస్సీ పాసయ్యాక తన భవిష్యత్తు తను చూసుకుంటుంది. లేదా మరొకరో, మనమేనో పైచదువులకి స్పాన్సర్ చెయ్యనూవచ్చు. నాగరికులమని పిలవబడే మనం మానవతాదృష్టితో ఈమాత్రం చేయూతనివ్వలేమా చెప్పండి''

అంతా తర్జన భర్జనలు పడుతూంటే ''ఒప్పుకోండి డాడీ'' అంటూ పిల్లలు వారి పేరెంట్స్ మీద ఒత్తిడి తెచ్చారు.

కడకి అంతా అంగీకరించి తప్పట్లు కొట్టేసరికి అనంతమూర్తి పొంగిపోయాడు.

''మనలాగే ఒకో ఎపార్ట్‌మెంట్‌వాళ్ళు కనీసం ఒకో అనాథకి ఆశ్రయమిచ్చి చదువు చెప్పిస్తే మనం నాగరికులం అని రొమ్ము విరుచుకొని నడవ్వొచ్చు'' అన్నాడు.

తప్పట్లు కొడుతూ ఈలలు వేస్తూ డాన్సుచేశారు పిల్లలు.

మర్నాడు ఒక పాప దుస్తులు ధరించి, మరో బాబు పుస్తకాలు, ఇంకో అమ్మాయి సంచీ తీసుకొని, ఇంకో పాప జోళ్ళు తొడుక్కొని మల్లి స్కూలుకెళ్తొంటే పిల్లలూ పెద్దలూ ఆనందంగా చేతులూపారు.

వెనుతిరిగి చేతులు జోడించింది మల్లి. సరస్వతీ సాక్షాత్కారమైనట్టు పరమానంద పడిపోతోంది.

''పద మల్లీ''

అనంతమూర్తి వెంట అడుగులేసింది మల్లి.

★




